

ఆలేరులో రైల్వే అండర్ పాస్ పనులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

రైల్వే అండర్ పాస్ పనులు ప్రారంభం

ఆలేరు, జనవరి 18 : పట్టణంలో రైల్వే అండర్ పాస్ పనులను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 90రోజుల్లో పనులు పూర్తవుతాయని తెలిపారు. ఆలేరు రెవెన్యూ డివిజన్, మున్సిపాలిటీలో అభివృద్ధి పనులపై మంత్రులతో చర్చించామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

● భూదాన్‌పోచంపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

భూదాన్‌పోచంపల్లి, జనవరి 18 : మున్సిపల్ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఏరియర్స్ ఇప్పించాలని, ప్రతినెల 5 లోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ పెంచిన రూ.1000తో కలిపి అందజేయాలని కోరారు. కార్మికులకు యూనిఫామ్, గ్లౌజ్‌లు, సబ్బులు, నూనె, చెప్పులు అందించాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నరసింహారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు సత్తయ్య, శంకర్, హరికృష్ణ, శ్రీధర్, రమేశ్, రామయ్య, రాజు, పరమేశ్, చంద్రకళ, లలిత, సబిత, శంకరమ్మ పాల్గొన్నారు.

ఉపాధి పనులను గుర్తించాలి

● ఎంపీడీఓ నిరంజన్‌వళి

మాట్లాడుతున్న ఎంపీడీఓ నిరంజన్‌వళి

ఆత్మకూరు(ఎం), జనవరి 18 : గ్రామాల్లో ఉపాధి హామీ పనులను గుర్తించి జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి పని కల్పించాలని ఎంపీడీఓ ఎండీ నిరంజన్‌వళి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ నిధుల మంజూరుతో పాటు గ్రామాల అభివృద్ధిపై చర్చించారు. సమావేశంలో ఎంపీఓ పద్మావతి, ఏపీఓ రమేశ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి

● యువ కవి స్వామి

యువ కవి స్వామిని సన్మానిస్తున్న గ్రంథాలయ కమిటీ సభ్యులు

ఆత్మకూరు(ఎం), జనవరి 18 : రాష్ట్ర ప్రభుత్వంతో పాటు యువజన సంఘాలు ప్రతి గ్రామంలో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని యువ కవి, రచయిత బైరుపాక స్వామి అన్నారు. గురువారం మండలంలోని రాఘవాపురంలో ఏర్పాటు చేసిన రాఘవాభారతి గ్రంథాలయాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. గ్రామంలోని యువకులు ఏకమై గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం గ్రంథాలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ కొంపల్లి వెంకన్న, ఉప సర్పంచ్ కాటం నరేశ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరెళ్ల రమేశ్, నాగరాజు, ఉపాధ్యాయులు రవి పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బొమ్మలరామారం, జనవరి 18 : మండలంలోని మర్యాల జడ్పీహెచ్ఎస్ 1993-1994 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు గురువారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జిట్టా యాదిరెడ్డి, నందేవ్, చంద్రమోహన్, పూర్వ విద్యార్థులు చంద్రమౌళి, మాధవరెడ్డి, రజనీకుమార్, దామోదర్‌రెడ్డి, పొట్ట ఇస్తారి, సంజీవ, శ్యామల, జయసుధ, జ్యోతి పాల్గొన్నారు.

అయోధ్య రామాలయం ప్రారంభోత్సవానికి వెళ్తున్న సాయిదత్త పీఠాధిపతి రామానంద ప్రభూజీ

అయోధ్య రామాలయం ప్రారంభోత్సవానికి సాయిదత్త పీఠాధిపతి

బొమ్మలరామారం, జనవరి 18 : మండలంలోని పెద్దపర్వతాపూర్ నుంచి సాయిదత్త పీఠాధిపతి రామానంద ప్రభూజీ అయోధ్య రామాలయం ప్రారంభోత్సవానికి గురువారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు రామాలయ ప్రారంభ వేడుకలు ఘనంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో బోయిన నర్సింహ, దశరథగౌడ్, బొమ్మకంటి మల్లేశ్, వెంకట్‌రెడ్డి, బోడ శ్రీనివాస్, నరేశ్ పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ

కొలనుపాకలో అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

ఆలేరు రూరల్, జనవరి 18 : మండలంలోని కొలనుపాకలో అయోధ్య రాముడి అక్షింతలను గురువారం భక్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనంతుల సోమిరెడ్డి, గాదె సోమిరెడ్డి, తేరాల నర్సింహులు, అంకం రాజు, వంటేరు భాస్కర్‌రెడ్డి, వాసం కిశోర్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలి

● ఎమ్మెల్యే మందుల సామేల్

సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, జనవరి 18 : ప్రజా ప్రయోజనాల దృష్ట్యా మున్సిపాలిటీ అభివృద్ధి కోసం చేపడుతున్న రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోతున్న వారు సహకరించాలని ఎమ్మెల్యే మందుల సామేల్ కోరారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మోత్కూరు మున్సిపాలిటీ అభివృద్ధిపై మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ పాలక వర్గం తీర్మానం మేరకు డివైడర్ మధ్య నుంచి 40 ఫీట్ల రోడ్డు విస్తరణకు ఇండ్లు, మడిగెలను సోమవారం నాటికి స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. ఆ తర్వాత మున్సిపల్ చట్టం ప్రకారం అధికారులు తొలగించి తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న 72 విద్యుత్ స్తంభాలను తొలగించడం కోసం వాటి స్థానంలో కొత్త స్తంభాల ఏర్పాటు కోసం రూ.45 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు చెప్పారు. ఆ పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. పట్టణంలోని ఎస్బీ వద్ద, బృందావన్ కాల్వ వద్ద, అరుణోదయ వద్ద మూడు కల్వర్టుల నిర్మాణాల పనులను మొదలు పెట్టాలని ఆదేశించారు. వానకాలం వస్తే కల్వర్టుల నిర్మాణానికి ఆటంకం కలుగనున్నదని వేసవి మూడు మాసాల్లో పూర్తికి చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో పనులను మొదలు పెట్ట కపోవడం వల్ల ఇప్పటికే రూ.4.50 కోట్ల నిధులు వృథా అయ్యాయన్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు 1,200 మీటర్ల రోడ్డు బీటీకి బదులుగా సీసీగా మార్చేందుకు రూ.7 కోట్ల నిధుల కేటాయింపునకు కృషి చేయనున్నట్లు వివరించారు. ప్రస్తుతం రూ.2 కోట్లతో డాగ్‌బంగ్లా ఆవరణలో నిర్మాణం చేస్తున్న మున్సిపల్ భవనం సరైన ప్రదేశంలో లేదని దాన్ని పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలో నిర్మిస్తే పాత గ్రామానికి పూర్వ వైభవం రానున్నట్లు తెలిపారు. పట్టణ వాసుల అభిప్రాయం సేకరించి నిర్మాణంపై నిర్ణయం తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అలాగే పట్టణంలోని పాత కురగాయల మార్కెట్ స్థలాన్ని ఆక్రమించి కొందరు ఇళ్ల నిర్మాణాలు చేశారని, ఆ స్థలాన్ని మున్సిపాలిటీ స్వాధీనం చేసుకోవాలన్నారు. మోత్కూర్ పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా మార్చడం కోసం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదరం రాజనర్సింహను కలిసి విన్నవించినట్లు ఈ మేరకు హామీ పొందినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఏఈ సురేశ్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



మైలారీగూడెంలో చెన్నారెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

మృతుల కుటుంబాలకు గొంగిడి సునీత పరామర్శ

యాదగిరిగుట్ట, జనవరి 18 : మండలంలోని మైలారీగూడెంలో అనంతుల చెన్నారెడ్డి ఇటీవల మృతి చెందగా మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే మాసాయిపేటకు చెందిన వాకిటి కృష్ణ తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా.. ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మైలారీగూడెం ఉప సర్పంచ్ మారెడ్డి కొండల్‌రెడ్డి, నాయకులు గుణగంటి బాబురావు, బండి ముత్యాలు, కాదూరి వెంకటేశ్, గౌడ యాదగిరి, గుండ్లపల్లి శ్రీను, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

బస్వాపూర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల సందర్శన

తుర్కపల్లి : చోక్లాతండా రిజర్వాయర్ ముంపు గ్రామాలను సందర్శించిన అధికారులు

తుర్కపల్లి, జనవరి 18 : బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న మండలంలో రుస్తాపురం రెవెన్యూ పరిధిలో గల చోక్లాతండా, కోక్యాతండా గ్రామాలను గురువారం అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ఇండ్ల కొలతలు తీసుకున్నారు. ఇటీవల కలెక్టరేట్‌లో రిజర్వాయర్ నిర్మాణంపై ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య చేసిన సూచనల మేరకు సర్వే చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ కురీష్‌ద్‌మహీనోద్దీన్, డిప్యూటీ ఈఈ అభిషేక్‌సాయి, ఏఈ రాజా రంజిత్‌కుమార్, తాసీల్దార్ దేశీయా, సర్పంచ్ సరిత రాంజీ పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలి

● రాష్ట్ర ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ గీత

ఇంద్రియాలలో విద్యార్థినికి సర్టిఫికెట్ అందిస్తున్న రాష్ట్ర ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ గీత

భూదాన్‌పోచంపల్లి, జనవరి 18 : సమాజ అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని రాష్ట్ర ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ గీత అన్నారు. గురువారం మండలంలోని ఇంద్రియాలలో పోచంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, యూనిట్ 2 ఆధ్వర్యంలో నిర్వహించిన శీతాకాల ప్రత్యేక శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. శిక్షణ శిబిరంలో నేర్చుకున్నది గ్రామాల్లో ఆచరించి చూపాలన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంజీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి పసుపుల, కళాశాల ప్రిన్సిపాల్ కోట విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ దొడ్డి అలివేలు, ఉప సర్పంచ్ ఉడతల సాయిరాంయాదవ్, గ్రామ కార్యదర్శి ప్రశాంతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు దుర్గం సాయివర్ధన్, వి.జ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

21న మున్నూరు కాపు వివాహ పరిచయ వేదిక

మాట్లాడుతున్న మహాసభ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

కాచిగూడ, జనవరి 18 : మున్నూరు కాపు మహాసభ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న మున్నూరు కాపు యువతీ, యువకుల కోసం వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. గురువారం మహాసభ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు హైదరాబాద్ కాచిగూడలోని మ్యాడం అంజయ్య హాల్‌లో వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 35 ఏండ్లుగా నిర్వహిస్తున్న ఈ వివాహ పరిచయ వేదికలో తెలంగాణలోని యువతీ యువకులు పాల్గొని వివాహ సంబంధాలు పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి కొండా సురేఖ, విప్ ఆది శ్రీనివాస్, ఎంపీలు బండి సంజయ్, ధర్మపురి అరవింద్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యే దానం నరేందర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవీందర్, కె.లక్ష్మణ్, ట్రస్ట్ చైర్మన్ ఎం.ఆర్.వెంకట్రావ్ హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివాహ పరిచయ వేదిక చైర్మన్ గోపాల రాధాకృష్ణ, కన్వీనర్ కొమ్ము శ్రీనివాస్, లింగిశెట్టి హనుమంత్ రావు, మణికొండ రమేశ్‌కుమార్, ప్రకాశ్, కొంతం సురేశ్ బాబు, కట్టెల సుభాశ్, ప్రహలాద్, సదానంద్, శ్రీనివాస్ రావు, జి.సత్యనారాయణ, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

బీబీనగర్, జనవరి 18 : మండలంలోని జైనపల్లిలో గల కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ గర్భగుడి తాళాలు పగులగొట్టి సుమారు 2 తులాల బంగారు ఆభరణాలతో పాటు హుండీలోని నగదును ఎత్తుకెల్లారు. ఎస్ఐ యుగేంధర్‌గౌడ్ సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పీఏసీఎస్ సభ్యత్వ రుసుము తగ్గించాలి

● పీఏసీఎస్ కార్యాలయం ఎదుట రైతు సంఘం నాయకుల నిరసన

పీఏసీఎస్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

సంస్థాన్‌నారాయణపురం, జనవరి 18 : సంస్థాన్‌నారాయణపురం సహకార సంఘంలో సభ్యత్వ రుసుము తగ్గించాలని రైతు సంఘం నాయకులు గురువారం పీఏసీఎస్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య మాట్లాడుతూ రైతుల వద్ద సభ్యత్వ రుసుం రూ.3వేలు తీసుకుంటున్నారని, దానిని రూ.311 తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దుబ్బాక భాస్కర్, చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, పొట్ట శంకరయ్య, సుర్వి నర్సింహ, పల్లె మల్లారెడ్డి, ముత్యాలు, ఇద్దయ్య, గాలయ్య పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా పాశం భాస్కర్

పాశం భాస్కర్

భువనగిరి అర్బన్, జనవరి 18 : బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా భువనగిరి పట్టణానికి చెందిన పాశం భాస్కర్ నియమితులయ్యారు. ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు 5 సంవత్సరాలుగా అధ్యక్షుడిగా కొనసాగారు. జిల్లా అధ్యక్షుల మార్పుల్లో భాగంగా పాశం భాస్కర్‌కు గురువారం నియామక ఉత్తర్వులు అందజేశారు.

ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వరాచారి

వెంకటేశ్వరాచారి

రామన్నపేట : బీజేపీ జిల్లా ఉపాధ్యాక్షుడిగా మండలకేంద్రానికి చెందిన సింగిల్ విండో డైరెక్టర్ కన్నెకంటి వెంకటేశ్వరాచారిని నియమించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్ రావు ఆదేశాల మేరకు గురువారం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దాసరి మల్లేశం గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. జిల్లా కార్యదర్శిగా వనం అంజయ్యను నియమించారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఆదర్శ విద్యార్థులు

తుర్కపల్లి, జనవరి 18 : 67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ సాఫ్ట్ బాల్ పోటీలకు మండలంలోని రాంపురం గ్రామంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మధు ప్రకాశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నిర్వహించే పోటీల్లో సాత్విక, హరిక, శ్రీమల్లిక పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్‌తో పాటు పీడీ రమేశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

పలు రైళ్ల పునరుద్ధరణ

సిటీబ్యూరో, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : రైల్వే నిర్వహణ, పలు కారణాల వల్ల రద్దు చేసిన పలు రైళ్లను పునరుద్ధరిస్తూ రైల్వే అధికారులు గురువారం నిర్ణయం తీసుకున్నారు. దాండ్-నిజామాబాద్, నిజామాబాద్-పందాపూర్ స్టేషన్ల మధ్య రెండు రైళ్లను పాత టైమ్‌టేబుల్ ప్రకారం యథావిధిగా నడుపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. అలాగే, ధర్మాబాద్ - మన్మాడ్, ఔరంగాబాద్ - హైదరాబాద్, నాగర్సోల్ - నర్సాపూర్, ముంబై సీఎస్ఎంటీ - నాందెడ్, నాందెడ్ - పూణె, కాచిగూడ - నాగర్సోల్ స్టేషన్ల మధ్య నిలిచిపోయిన ఆరు రైళ్లను తిరిగి ఈ నెల 20 నుంచి షెడ్యూల్ ప్రకారం నడిపించనున్నామని అధికారులు పేర్కొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

భూదాన్‌పోచంపల్లి, జనవరి 18 : నల్లగొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులందరూ ఓటు నమోదు చేసుకోవాలని తాసీల్దార్ వీరబాయి తెలిపారు. గురువారం తాసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. నవంబర్ 1, 2020 ముందు డిగ్రీ పట్టా పొందిన వారు అర్హులని తెలిపారు. గతంలో ఓటర్లుగా నమోదైన వారు, కొత్తవారు -18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆమె వెంట డిప్యూటీ తాసీల్దార్ నాగేశ్వర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ సైదిరెడ్డి, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

పౌర సన్మానాన్ని విజయవంతం చేయాలి

● కురుమ సంఘం మండలాధ్యక్షుడు మహేందర్

యాదగిరిగుట్ట, జనవరి 18 : ఈ నెల 20న భువనగిరి మండలం రాయగిరిలోని లింగబసవ గార్డెన్‌లో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు జరిగే పౌర సన్మానికి కురుమ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని సంఘం మండలాధ్యక్షుడు కవిడే మహేందర్ కోరారు. గురువారం పట్టణంలోని కురుమ సంఘం భవన్‌లో కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యెగ్గే మల్లేశం, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశం, జూకంటి రవీందర్, డోకె బాలకృష్ణ, సుబ్బూరు బీరుమల్లయ్య, జడ్పీటీసీ తోటకూరి అనూరాధ, ఎంపీపీ చీర శ్రీశైలం, వస్పరి శంకరయ్య హాజరుకానున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కురుమ సంఘం మండల ప్రధాన కార్యదర్శి కొక్కలకొండ దేవేందర్, పట్టణాధ్యక్షుడు కర్రె లక్ష్మణ్, నాయకులు తోటకూరి యాదయ్య, దొడ్డి రవి, మహేందర్, బొట్టు స్వామి, మచ్చ సత్తయ్య, బైర శ్రీరాములు, సిద్దులు, గౌరయ్య పాల్గొన్నారు.

రైలు కిందపడి యువతి ఆత్మహత్య

బీబీనగర్, జనవరి 18 : మండలంలోని రంగాపురం పరిధిలో ఘట్‌కేసర్-బీబీనగర్ రైల్వే స్టేషన్ల మధ్య గురువారం రైలు కిందపడి యువతి ఆత్మహత్య చేసుకున్నది. ఎస్ఐ యుగేంధర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్‌కు చెందిన గుర్రం లక్ష్మారెడ్డి కుమార్తె మేఘనారెడ్డి (19) ఈ నెల 17న సాయంత్రం 7 గంటలకు బేకరీకి వెళ్లి వస్తానని ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో మేఘన తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ఘట్‌కేసర్-బీబీనగర్ రైల్వే స్టేషన్ల మధ్య కిలోమీటర్ నంబర్225/30-32 మైలురాయి వద్ద రైలు కిందపడి ఓ యువతి ఆత్మహత్య చేసుకున్నది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించి మార్చురీలో ఉంచారు. పోలీసులు లక్ష్మారెడ్డికి సమాచారం అందించగా మృతదేహాన్ని చూసి తన కూతురు మేఘనగా ధృవీకరించాడు. యువతి మృతికి గల కారణాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వివాదానికి తెరలేపిన అవివాహితుడి పూజలు

యాదగిరిగుట్ట, జనవరి 18 : వివాహం కావడం లేదని జమ్మి చెట్టుకు ఓ యువకుడి కుటుంబం చేస్తున్న పూజలు వివాదానికి దారి తీసింది. ఈ ఘటన మండలంలోని పెద్దకందుకూరు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన కోకల సందీప్(35) తనకు వివాహం జరుగాలని తన తండ్రి మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి కొన్ని రోజులుగా రాత్రి సమయంలో జమ్మి చెట్టు వద్దకు వెళ్లి దీపం వెలిగించి పూజలు చేస్తున్నాడు. క్షుద్ర పూజలుగా భావించిన గ్రామస్తులు వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా ఇద్దరు పట్టుబడ్డారు. మరో ముగ్గురు పరారయ్యారు. నెల రోజులుగా గ్రామంలో 10 మంది చనిపోయారని, క్షుద్ర పూజలతోనే అయిఉండవొచ్చని అనుమానించి వారిని పంచాయతీకి పిలిపించే ప్రయత్నం చేశారు. రావడానికి నిరాకరించిన సందీప్ యాదగిరిగుట్ట పోలీసులను ఆశ్రయించాడు. జమ్మి చెట్టుకు పూజలు చేస్తే వివాహం జరుగుతుందన్న నమ్మకంతో పూజలు చేస్తుంటే గ్రామస్తులు తప్పుగా భావించి కొట్టడానికి వచ్చారని ఫిర్యాదు చేశాడు. పోలీస్ స్టేషన్‌కు గ్రామస్తులు రావడంతో ఇరువర్గాల మధ్య కొంత ఉద్రిక్తత నెలకొన్నది. యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేశ్ జోక్యం చేసుకుని మూఢ విశ్వాసాలను నమ్మవద్దని, పూజలు గ్రామంలో ఎవరైనా నిర్వహించుకోవచ్చునని నచ్చజెప్పడంతో సమస్య సద్దుమణిగింది. పవిత్రంగా భావించే జమ్మి చెట్టు వద్ద పూజలు నిర్వహించరాదని గ్రామస్తులు తెలుపగా విరమించుకుంటానని సందీప్ తెలిపాడు.

నిజాయితీ చాటుకున్న విద్యార్థులు

దొరికిన 40 వేలు పోలీసులకు అప్పగింత

రైతుకు నగదు అందిస్తున్న ఎస్ఐ రాఘవేందర్‌గౌడ్

సంస్థాన్‌నారాయణపురం, జనవరి 18 : రైతు పోగొట్టుకున్న నగదును విద్యార్థులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించి నిజాయితీ చాటుకున్నారు. ఈ ఘటన సంస్థాన్‌నారాయణపురంలో గురువారం జరిగింది. ఎస్ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తగూడేనికి చెందిన రైతు ముత్యాలు బ్యాంక్‌లో నుంచి రూ.40వేలు డ్రా చేసుకుని ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో కింద పడిపోయాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు బండారు రాకేశ్, పగిల్ల పవన్ డబ్బులను తీసుకొని విద్యార్థులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రాఘవేందర్‌గౌడ్‌కు అప్పగించారు. ఎస్ఐ సీసీ కెమెరాలను పరిశీలించి బాధితుడిని పిలిపించి డబ్బులను అందజేశారు. డబ్బుకు ఆశపడకుండా నిజాయితీ చాటుకున్న విద్యార్థులను ఎస్ఐ శాలువాతో సత్కరించి అభినందించారు.